# రంగయ్య

కొత్త ఇంటికి గోడలు పూర్తిగా లేచాయి. దూలాలు సరిచేసి ఎక్కిస్తున్నారు. ఒకప్రక్క పెద్ద పందిరికింద పెద్దగొయ్యి తవ్వి కర్రకోస్తున్నారు. కొంతమంది కూలివాళ్లు ఇటుకలు మోస్తున్నారు. కొంతమంది బెండడియో వేస్తున్నారు.

ఇన్ని పనులమీద దృష్టి నిలిపి చూడలేక సుబ్బారావుకి నీరసం వస్తూంది. ఇంతమంది కూలీవాళ్లలో ఎవడు బద్ధకిస్తున్నాడో కనిపెట్టడం ఎంత కష్టం! ఒక కూలివాడు తట్ట కింద బెట్టి చెట్టుకు - చుట్ట వెలిగిస్తాడు. సుబ్బారావుకి ఆ సమయంలో చాలా కోపం వస్తుంది. కాని అతను ఏదో అందామనుకునేసరికి కూలివాడు తట్ట తీసుకుని మళ్లీ బయలుదేరుతాడు. తీరా తట్ట తీసుకు నడుస్తుంటే వాడు పనిచేస్తున్నట్టేగా. అంచేత సుబ్బారావు వాడిని ఏమీ అనలేకపోతాడు. కూలివాడు పైగా తనవేపు చూసి చిరునవ్వు నవ్వుతాడు.

సుబ్బారావుకి పదిహేను సంవత్సరాలు. మేనమామగారి ఇంట్లో ఉండి చదువుకుంటున్నాడు. అతని మేనమామ పేరు రామశాస్త్రి. కట్టే కొత్త ఇల్లు రామశాస్త్రిది, అతను సుబ్బారావును పిలిచి ఒకనాడు అన్నాడు.

"ఒరే సుబ్బన్నా! నువ్వు ఈ శలవులకి ఇంటికి ఎందుకు పోవడం? నీకు సంగతులన్నీ బాగా తెలుస్తాయి. మనకొత్త ఇంటి దగ్గరకు పోయి కనిపెట్టి చూస్తుండు ఇటువంటివన్నీ నేర్చుకోవాలి. ఒరేయి, ఆ కూలివాళ్ళు దొంగవెధవలు సుమా! జాగ్రత్తగా కనిపెట్టి చూస్తుండాలి. బోలిడంత యినప సామాను, కర్ర ఉంది, ప్రతిరోజు లెక్కవేస్తుండు సామాను. చెప్పడం మరచిపోయాను. ఆ రంగయ్య వొట్టి బద్ధకస్తుడు. వాడిని పొడుస్తుండాలి."

కాని సుబ్బారావుకి రంగయ్యని చూస్తే అమిత భయం. రంగయ్య ఎప్పుడోకాని పనిచెయ్యడు. ఊరికే చుట్టకాలుస్తూ తిరుగుతుంటాడు. మెలితిరిగిన మీసాలు. ఎర్రటి కొంటెకళ్ళు, అతనినెవ్వరూ లొంగదియ్యలేరు. అతడు తిరుగుతూ కబుర్లు చెప్పుతుంటాడు. పనివాళ్లు విని నవ్వుతుంటారు. ఆ నవ్వడంలో కొంతసేపు పని ఆగిపోతుంది.

సుబ్బారావుకి వాళ్ళందరు పనిచేసిన దానికంటే నవ్వడంలోనే ఎక్కువకాలం వినియోగం పడుతున్నట్టు అనుమానం. అంచేత అతను ఒకనాడు ధైర్యంచేసి రంగయ్య దగ్గరకు వెళ్ళి సగం జంకుతూనే అన్నాడు.

"రంగయ్యా! నువ్వు బొత్తిగా పనిచెయ్యడం లేదు. మామయ్యతో చెపుతాను." రంగయ్య విరగబడి నవ్వాడు. పక్కనివున్న ఒక పెద్దదూలం మీద కూర్చుని చుట్ట నుసి రాల్చాడు.

"ఇలారా పంతులూ! కూకో. సూశా! మేస్త్రీ అంటే ఏమనుకుంటున్నా? కూలోళ్ల శాత పని చేయించాలన్నమాట. ఇలా వచ్చి కూకో కాళ్లు లాగుతాయి."

సుబ్బారావుకి లోపల చాలా అసహనంగా ఉందిగాని ఏమీ అనలేక పోయాడు. దూలంమీద కూర్చుని ఈపని విషయంలో నిబంధనలేమిటోనని ఆలోచిస్తున్నాడు. రంగయ్య ఏదో చెపుతున్నాడు. కూలీలు వింటున్నారు సరదాగా.

రంగయ్య నలభయి సంవత్సరాల నల్లటి మనిషి, అతను పుట్టుకతోనే సోమరిగా పుట్టి ఉంటాడు. కబుర్లలో అతన్ని కాదనగలవాడెవడూ అతనికి ఇంతవరకు తగలలేదు. అతనికి పని అప్పగించేవారందరూ అతన్ని ఎరుగుండే అప్పగిస్తారు. అతను పనిచెయ్యడం లేదని ఎదురుగుండా వచ్చి ఎవరూ అడగలేరు. అతను నిజానికి అంత మోటుమనిషికాదు. మాటకుమాట ఫెడీమని అంటాడు. అంచేత అతనంటే అందరికీ జంకు.

ఒకనాడు పొద్దున్న సుబ్బారావు పెద్ద గొడవచేసాడు. మేకుల బుట్టలో రెండు మరమేకుల పొట్లాలు పోయాయి. కూలీలంతా అతనిమీద జాలిదలచినట్టు చుట్టూ చేరి చూస్తున్నారు. అతను ఏం చెయ్యడానికీ తోచని గొంతుకతో అంటున్నాడు.

"చెప్పండి ఎవరు తీశారో, మా మామయ్యతో చెపుతాను. లేకపోతే" ఇంతలో రంగయ్య వచ్చాడు. "పొండ్రా పనిలోకి అల్లా సూత్తారేంటి ఏం పంతులూ?

"మరమేకుల పొట్లాలు రెండు పోయాయి."

"రంగయ్య చుట్టకొసరు పంటితో కొరుకుతూ అన్నాడు, అంతేగదా రెండేనా? పోతే పోనాయిలే... యెక్కన్న గారిల్లు కట్టేటప్పుడు దూలాలు దూలాలే పోనాయి."

"మా మామయ్యతో చెపుతాను."

"చెప్పు... చెప్పేంలాభం?"

"ఎవరు తీశారో చెప్పడం లేదు."

"ఏం గాపకముంటుందీ, నిన్నరేత్రి ఏ కల్లుపాకలోకో పోయుంటాయి. ఎవడికి గుర్తుంటుంది?"

"అల్లా దొంగతనంగా పట్టుకుపోతే ఎల్లాగమరి"

"తమ్ముడూ, నువ్వు దొంగతనమంటున్నావా? నిజంగా దొంగతనంకాదు. మీ మామ ఎంత దొంగో నీకు తెల్సా ఒడ్డీలమీద ఒడ్డీలు కూడేసి ఎన్ని కొంపలు మట్టం చేశాడు మరి? పోనీ ఈళ్ళకి రోజుకి రూపాయన్నా లేకపోతే తాగుడికీ తిండికి ఎల్లా సరిపోద్ది?"

"అందుకోసం దొంగతనం చేస్తారా?"

"మళ్లీ దొంగతనమంటావేంటి? సూశా! సందటేల అలసిపోయి దాదితగా ఉంటాది. సేతిలో మీ మామ దమ్మిడీ పెట్టడు. ఏదో సేతికొచ్చింది పటుకుపోకపోతే సత్తారా? నువ్వే చెప్పు. ఏమంటా?"

సుబ్బారావు మాట్లాడలేదు. ఇంత దొంగముండావాడు ఈ లోకంలో ఇంకొకడు ఉండడనుకున్నాడు. కాని రంగయ్యని చూస్తే అతనికి లోపల ఏదో ఆందోళన కలుగుతుంది.

"సూడు తమ్ముడూ! మీ మామతో ఇట్టాంటివన్నీ సెప్పి ఏం లాభం, పోయిన సరుకు ఎల్లాగారాదు. పైగా ఎందుకు పోయిందని నిన్నే తంతాడు. మీ మామ మంచోడుకాదు."

రంగయ్య లేచి కూలి వాళ్లని హెచ్చరించడానికి వెళ్లాడు. సుబ్బారావు ఈ విషయాన్ని మేనమామకు చెప్పాలా? అక్కరలేదా అని చాలాసేపు తర్కించుకున్నాడు. అతని మనసు ఏ నిశ్చయానికీ రాలేదు. ఇలా రెండు రోజులు గడిచిపోయింది. రెండు రోజులు గడిచిపోయిన తరువాత విషయం పాతబడి పోయింది. ఇప్పుడింక చెప్పడంలో అర్థంలేదని సుబ్బారావు మాట్లాడక ఊరుకున్నాడు.

ఆవేళ ఎండ తీవ్రంగా ఉంది. పని కొంచెం ఇంచుమించుగా సాగటం లేదు. గోడలమీద లేచిన వాసాలు ఇంటి అస్థిపంజరంలాగ ఉన్నాయి. సుబ్బారావు కునికిపాట్లు పడుతూ పెద్ద చింత చెట్టుకింద తాటాకు చాపపరచుకొని పడుకున్నాడు. సగం మగతలో అనేక దృశ్యాలు అతని మనస్సులోంచి నడిచిపోతున్నాయి. ఈ కూలిపనివాళ్ళు, వాళ్లమీద ఈ రంగయ్య, మామయ్య ఇల్లు దూలాలు , వాసాలు - ఇవన్నీ అతని మనస్సులో గాబరా చేస్తున్నాయి. ఇవన్నీ ఉన్న లోకంలో తనబోటి అమాయకులు నివసించడానికి వీలున్నట్టు అతనికి తోచలేదు.

రంగయ్యని ఏ విధంగా అర్థం చేసుకోవాలో అతనికి ఎంత ఆలోచించినా తెగలేదు. అతన్ని చూసినప్పుడల్లా అతనికి మామయ్యగారింట్లో కోడెదూడ జ్ఞాపకం వస్తుంది, అది ఒక్కసారి అతను గోకితే అతని చేతిని నాకుతుంది. ఒక్కొక్కసారి గబుక్కుని గంతులేసి ముఖం వారగా పెట్టి నానా అల్లరీ చేస్తుంది, ఒక్కొక్కసారి పొడవడానికి తల వంచుతుంది. అంచేత దాన్ని ఎల్లా బుజ్జగించాలో అతనికి తెలియడంలేదు. రంగయ్యకూడా అంతే. ఆ కలత నిద్రలో అతనికి టపటపమని ధ్వని వినబడింది. మొదట బద్ధకించి ఇంకో పక్కకు తిరిగి కళ్ళు మూశాడు. టప టప శబ్దం మళ్ళీ వినబడింది. మొదట బద్ధకించి ఇంకొ పక్కకు తిరిగి కళ్ళు మూశాడు. టపటప శబ్దం మళ్ళీ వినబడింది. ఈసారి కొంచం గట్టిగా వినబడింది. సుబ్బారావు లేచి కూర్చున్నాడు. అతనికి మొదట్లో ఏదో పెద్ద జంతువు చుట్ట కాలుస్తున్నట్టు ఆకాశంలో పొగలు కన్పిస్తున్నాయి. పనివాళ్ళు పరుగెత్తుతున్నారు. వడ్రంగులు దూలాలమీద నిలబడి చూస్తున్నారు. ఒక వందగజాల అవతల ఇళ్లు అంటుకున్నాయి. రంగయ్య గబగబ వచ్చాడు. గట్టిగా అరుస్తూ ఆజ్ఞాపించాడు. ఒరేయి, ఆ వాసాలు, గీసాలు ఊడ పీకెయ్యండి దూలాలు కూడా కిందికి తప్పించెయ్యండి.

“గాలి అటుందిరా, దీనికి పరవాలేదన్నాడు” ఒక వడ్రంగి. “ఊడ పీకేత్తే ఇంకోనెల పనిపెరుగుద్ది, ఎర్రి నాయాలా, ఏమో ఎవరు సూడొచ్చారు? గాలి ఉన్నట్టుండి ఇటు తిరిగితే, ఇప్పెయ్యండి గబగబ”

సుబ్బారావుకి నోట మాటలేదు. అప్పుడే వడ్రంగులు వాసాలు పీకేస్తున్నారు. రంగయ్య కాలిన ఇళ్ళవేపు గబగబపరిగెత్తాడు. సుబ్బారావు అతన్ని పిలుస్తూ అతని వెనకాలే వెళ్లాడు.

రెండు ఇళ్లు జంటగా కాలుతున్నాయి. ఇవతల ఇద్దరు మగవాళ్లు, ఇద్దరు ఆడవాళ్ళు నెత్తినోరూ మొత్తుకుని ఏడుస్తున్నారు. చాలామంది దూరంగా నిలబడి చోద్యం చూస్తున్నారు. కొంతమంది చంద్రుడికి నూలు పోగన్నట్టు ఒక బిందెడు నీళ్ళు ఆ పెద్ద మంటల్లోకి చల్లుతున్నారు.

రంగయ్య నిలబడి చూశాడు. ఒక వెర్రి మొగంవాడు రంగయ్య దగ్గరకు వచ్చి అన్నాడు.

"ఇంట్లో నలుగురు పిల్లలూ, ఒక ముసిలీ ఉండిపోయారు. గుమ్మాలు అంటుకుపోయినాయి. పాపం ఆళ్ళు ఏడుత్తున్నారు."

"ఏ గదిలో ఉన్నారు?"

ఏడుస్తున్న మగవాళ్ళలో ఒకడు దీనంగా దగ్గరకు వచ్చి అన్నాడు. "ఇద్దరు పిల్లలు దచ్చినం గదిలో పడుకున్నారు. ఇద్దరు పిల్లలూ ముసలమ్మా పడమటింట్లో ఉన్నారు. అయ్యమ్మో! కాలిమసయిపోతారు. నా తల్లులోయి కుర్రాడు ఒక్కగాను ఒక్క కుర్రాడు బాబోయి...

"నోరు మూసుకో సిగ్గునేదూ... మొగోడివి"

రంగయ్య తొడుక్కున్న బనీను విప్పాడు. ఇంతలో సుబ్బారావు అతని దగ్గరకు చేరుకున్నాడు. రంగయ్య బనీను అతని చేతిలో పెట్టాడు ఇంటి అరుగు దగ్గరకు వెళ్ళి పరిశీలించి చూస్తున్నాడు. సుబ్బారావు కోపంగా అతన్ని సమీపించాడు.

"ఇల్లంతా మళ్ళీ విప్పెయ్యమంటావా? మామయ్యతో చెబుతానుండు" అన్నాడు అంత దూరాన్నుంచి.

ఒక కాలిన దూలం కింద పడిపోయింది. రంగయ్య పక్కనున్న మనిషి తలకి చుట్టుకున్న తువ్వాలు పీకి గోచిపెట్టి పంచి సుబ్బారావు చేతికిచ్చాడు. "మాట్టాడావంటే మక్కలిరుగుతాయి. కూడా కూడా తిరిగావా సత్తావు"

సుబ్బారావు మెదడు దిమ్మెక్కిన మీదట జవాబు ఏమీ చెప్పలేదు. రంగయ్యని పెద్ద కళ్ళతో అమాయకంగా చూశాడు. రంగయ్య పెద్ద రెండు కొత్త వాసాలు తెప్పించాడు. రెండు చేతుల్లోను రెండు పట్టుకుని మండుతున్న ద్వార బంధం దగ్గరకు వెళ్లాడు. అరుగుమీద కట్టు ఇంకా కాలుతూంది. రెండు వాసాలను కింది కొసలకు ఆన్చి శక్తి కొద్దీ కాలుతున్న ద్వారబంధాన్ని నెట్టాడు. సగం కాలిన కర్ర పట్టుతప్పి కొంచం తూలాడు. మీద పడబోయే ద్వారబంధాన్ని చేతులో ఉన్న వాసంతో అరుగుకిందకి నెట్టాడు. పెద్ద మంట మండుతూ ద్వారబంధం కిందపడిపోయింది! రంగయ్య ఇంట్లో ప్రవేశించాడు. నిప్పు వేడి తగలకుండా దూరంగా నిలబడి అందరూ చూస్తున్నారు. ఇంట్లో అంతా మంటలు, పొగ, అన్ని తలుపులూ అంటుకున్నాయి. రంగయ్య శరీరం ఉడుకుతోంది. ఊపిరి ఆడడంలేదు. తిన్నగా పొగ మంటల మధ్య నించి పడమటి వసారాలోకి దూకాడు. భుజం కాలింది. చేత్తో కాలినచోట రాసుకుంటూ ఇటూ అటూ వెదికాడు. ఇద్దరు పిల్లలు ముఖాలు జేవురించి కిందికిపడి అటూ ఇటూ దొర్లుతున్నారు. ముసిలి ఒక పక్కని గోడకి జేరబడి కొన ఊపిరితో స్పృహ తప్పింది. ఇద్దరు పిల్లలూ అతన్ని చూశారు. కాని లేవలేకపోయారు. బయటికి రావడానికి మార్గం లేదు. గుమ్మం పెద్దగా మండుతోంది. సావడీలోంచి పోవాలంటే మంటల మధ్యనించి వెళ్ళాలి. పిల్లలు తట్టుకోలేరు. కిటికీలోంచి అవతలకి చూశాడు. వసారా అవతల దొడ్డి. అయితే దొడ్డిలోకి దారి ప్రక్క కొంజాలోంచి ఉంది. కొంజా పెద్దగా మండుతోంది. రంగయ్య కిటికీ మీద పని ప్రారంభించాడు. కిటికీ ఇంకా అంటుకోలేదు.

ఇనప ఊసలు పాతవయినా గట్టిగా ఉన్నాయి. ఒక్క క్షణం పాటు అతనికి ఆలోచన పోలేదు. మంట పొగలు పక్క కొంజాలోంచి వసారాలోకి పాకుతున్నాయి. చటుక్కుని అతనికి ఆలోచన తట్టింది. చేతిలో వాసాలన్ని చివరపట్టుకుని రెండో కొసలు కిటికీ ఊసల మధ్య తగిలించి దూరంగా నిలబడి శక్తికొద్దీ వంచాడు. ఊసలు కొంచం పెంకితనంచేసి ఒంగిపోయాయి. ఒక్కొక ఊసని రెండు చేతుల్లోనూ పట్టుకుని తన బరువంతా గోడకు తన్నిపట్టి లాగాడు. ఊసలు కమ్ముల్లోంచి ఊడిపోయాయి. ఆ వూపుకి రంగయ్య వెనక్కి పడిపోయాడు. పైనించి దూలం కాలి పడబోతూంది. గబుక్కుని లేచి ఇద్దరు పిల్లల్ని చెరొక చేత్తోనూ పట్టుకుని గోడ పక్కకి లాగాడు. దూలం పడిపోయింది. మంట దగ్గరగా వచ్చి దేహాన్ని ఉడికిస్తూంది. కడుపులో అతనికి త్రిప్పు ప్రారంభమయింది. కళ్ళు మూసుకుని ఇద్దరు పిల్లల్ని కిటికీ దగ్గరగా తీసుకువచ్చి కిటికీలోంచి దొడ్డిలోకి దింపాడు. దొడ్డివేపు కొంతమంది జనం వచ్చి రంగయ్య ప్రయత్నాలన్నీ చూస్తున్నారు. రంగయ్య ముసలమ్మని కూడా కిటికీలోంచి దించాడు. అవతల్నించి ఎంతోమంది కేకలు వేశారు. "నువ్వుకూడా దిగొచ్చెయ్యి రంగయ్యా"... "సచ్చిపోతావు రంగయ్యా" "ఇంకొచ్చెయ్యి" ఒక్క క్షణం కిటికీకి చేర్లబడి నిలబడ్డాడు. అతనికి స్పృహ తప్పి మళ్లీ వచ్చింది. అతని మనస్సులో ఏదో ప్రవేశించింది. కాలుతున్న ఇంట్లోకి నిర్లక్ష్యంగా నడిచి వెళ్లాడు. అందరూ సగం సందేహంతో సగం భయంతో అతను కనుపించినంతవరకు చూశారు.

సుబ్బారావు అందరినీ తప్పించుకుని ముందుకు వచ్చి చూశాడు. రంగయ్య ముసలమ్మని ఇవతలకి అందించి లోపలకు వెళుతున్నాడు. రంగయ్య ముఖంలో చావును జయించిన వెలుగేదో సుబ్బారావుకి కనిపించింది. నోరు తెరుచుకుని రంగయ్య ముఖాన్ని జ్ఞాపకం చేసుకుంటూ నిలబడ్డాడు.

దక్షిణపు వేపు దొడ్డిలోని రంగయ్య గొంతుక వినపడింది. దొడ్డి గోడకి తలుపు లేదు. నిచ్చెన వేసుకుని ఇద్దరు ఎక్కారు.

దొడ్డిలో స్పృహ తప్పిన ఇద్దరు పిల్లలు రంగయ్య ఉన్నారు. సుబ్బారావుకూడా చటుక్కుని గోడ ఎక్కాడు. రంగయ్య మామూలు రంగయ్యలాగ లేడు. ముఖం మాడిపోయింది. రెండు మూడు చోట్ల చర్మంకాలి పోయింది. కళ్ళు ఎర్రగా గొప్పగా వెలుగుతున్నాయి.

ఇద్దరు పిల్లల్నీ, రంగయ్యనీ ఇవతలికి తెచ్చారు. భక్తిగా చూసాడు, పిల్లల తల్లిదండ్రులు రంగయ్య రెండు చేతులూ పట్టుకుని సంతోషం, కృతజ్ఞతా వెలిబుచ్చుతూ ఏడ్చారు. రంగయ్య పచ్చికమీద వెల్లకిల పడుకున్నాడు. నలుగురయిదుగురు చుట్టూ చేరారు. తక్కినవాళ్ళు చుట్టూ గుడికట్టి అతని ధైర్యస్థైర్యాలని పొగుడుతున్నారు.

కల్లు రెండు ముంతలు తేండ్రా అన్నాడు కళ్ళుమూస్తూ రంగయ్య. సుబ్బారావు అతని తలయెత్తి అతని పంచె బనీను, లుంగీ చుట్టి తలగడ కింద పెట్టి పక్కని కూర్చున్నాడు.

కల్లు తాగిన అరగంటదాకా రంగయ్యకు స్పృహలేదు. తరువాత కళ్ళు తెరిచాడు. వంటికంతకీ ఇద్దరు ఆముదం పట్టిస్తున్నారు. రంగయ్య సుబ్బారావుని చూశాడు. వెనుకటి కొంటెతనం అతని చూపుల్లో ప్రవేశించింది.

"ఏం పంతులూ, ఇల్లంతా ఇప్పేశారా?"

"నేను చూడలేదు"

"సూశావా పంతులూ, మనిసయి పుట్టినందుకు నాలుగు రాళ్ళొచ్చేటట్టు సూడాల. మీ మామయ్య ఇల్లు పూర్తయితే ఇంక మాకు పనేది? ఇప్పుడింకో రెండునెల్లు ఇంకా పనుంటుంది."

సుబ్బారావు దానికేమీ సమాధానం చెప్పలేదు. అతనివేపు ఒక్క క్షణం చూచి అన్నాడు.

"నువ్వు ముందూ వెనకా చూసుకోకుండా అల్లా మండుతున్న ఇంట్లోకి వెళ్లిపోయావు గదా; వాళ్లంతా కాలి చచ్చిపోతే?

"సచ్చిపోతే రేపటికి రెండు" అంటూ రంగయ్య బాధతో కళ్ళు మూస్తూనే పెదవులతో నవ్వాడు.

**భారతి - (జూన్, 1947)**